ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 10 జనవరి 2024

బెదిరింపులకు లొంగం

భీమవరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీల జైల్ భరో

భీమవరం అర్బన్, జనవరి 9: పోలీసులతో అరెస్టులు చేసినా, ఎస్మా ప్రయోగిస్తామని బెదిరించినా లొంగేది లేదంటున్నారు అంగన్‌వాడీలు. కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం భీమవరంలో జైల్ భరో కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, జట్టు కార్మికులు, రైస్‌మిల్ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ వంటి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడి నుంచి తాలుకా ఆఫీసు సెంటర్లో రోడ్డుపై బైఠాయించారు.పోలీసులు ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేసి భీమవనం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలన్, రాజా రామ్మోహన్ రాయ్‌లు మాట్లాడుతూ 29 రోజులుగా అంగన్వాడీలను నడి రోడ్డుమీద నిలబెట్టిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు.



భీమవరం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు..పాల్గొన్న కార్మిక సంఘాలు

మునిసిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

భీమవరం టౌన్, జనవరి 9 : మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె 15వ రోజుకు చేరుకుంది. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కిలారు మల్లేశ్వరరావు,ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చెల్లబోయిన రంగారావులు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి విరమించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రమణ, సత్యనారాయణ, లక్ష్మీపతి, రెల్లి రాము తదితరులు పాల్గొన్నారు.



భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన



కాయ్..రాజా
కాయ్..

కోడి పందేలకు ఆఫర్ల వల
నిర్వాహకుల కొత్త ఎత్తులు
పెద్దమొత్తంలో నగదు నజరానాలు
వరుసగా మూడు గెలిస్తే బుల్లెట్
పందెం రాయుళ్లను ఆకట్టుకునే ప్రయత్నాలు
అనుమతులు వస్తాయన్న ధీమా
ఇప్పటికే జిల్లాలో హోటల్స్ ఫుల్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలు అంటే పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రధానంగా గుర్తుకొచ్చేవి కోడి పందాలు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్నాటక, తమిళనాడు నుంచి జిల్లాకు సంక్రాంతి రోజుల్లో పెద్ద ఎత్తున పందెం రాయుళ్లు చేరుకుంటారు. పందాలను తిలకించేందుకు అతిథులుగా జిల్లాకు రావడం ఆనవాయితీ. ఈసారి కోడి పందాల కోసం నిర్వాహకులు ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆఫర్‌లు ప్రకటిస్తున్నారు.జిల్లాలో భీమవరం, గణపవరం, ఉండి, ఆకివీడు తదితర ప్రాంతాల్లో భారీ పందాలు వేస్తుంటారు. తాడేపల్లిగూడెం పరిధిలోనూ బరులు వేసేవారు. స్థానికంగా అధికార పార్టీ నేతలతో ఇబ్బందుల వల్ల ఇతర ప్రాంతాలకు నిర్వాహకులు తరలిపోతున్నారు. ఒకవైపు పోలీసులు హెచ్చరికలు జారీచేస్తున్నా మరోవైపు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. చివరి దశలో ప్రభుత్వం అనుమతులు ఇస్తుందన్న ధీమా పందెం రాయుల్లో నెలకొంది. గణపవరం పరిధిలో నిర్వహించే బరిలో ఒక్కో పందానికి ఇప్పుడే రూ. 3.20 లక్షలుగా నిర్ధారించారు. అక్కడ ఐదు పందాలు వరుసగా వేస్తారు. అందులో మూడు పందాలు నెగ్గిన వారికి బుల్లెట్ ఆఫర్ ఇస్తున్నారు. అదే తాడేపల్లిగూడెం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన నిర్వాహకులైతే రూ. 1.20 లక్షల నజరానా ప్రకటించారు. ఇలా ఎవరికి వారి ఈ ఏడాది ఆఫర్‌లతో ముందుకొస్తున్నారు.

నేతలకు కాసుల పంట



కోడి పందాలు కూడా అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తున్నాయి. తాడేపల్లిగూడెంలో పెద్ద బరి ఉండేది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బరి వేయడాన్ని నిలిపివేశారు. బరి నిర్వహించాలంటే అధికార పార్టీ నేత లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. దాంతో నిర్వాహకుడు ఉంగుటూరు నియోజకవర్గానికి వెళ్లిపోయారు. అక్కడ బరి నిర్వహి స్తున్నారు. కోడి పందాల్లోనూ అధికార పార్టీ నేతలు కాసులు వసూలు చేయడం ఇప్పుడు కొత్తగా అమలు జరుగుతోంది. గతంలో తమ పార్టీ అనుకూలురుకు బరులు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించేవారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలకు తరతమ బేధం లేదు. సొమ్ములు చెల్లిస్తే ఎవరికైనా పందేలు వేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇలా సంక్రాంతి రోజుల్లో లక్షల రూపాయలు పోగేసుకుంటున్నారు.

విదేశీ కోళ్లతో బ్రీడ్

కత్తులతో కోడి పందాలు ఎక్కువగా నిర్వహిస్తుంటారు. అదే సమయంలో డింకీ పందాలు వేస్తున్నారు. తీర ప్రాంతంలో డింకీ పందాలు వేయడం పరిపాటిగా వస్తోంది. కత్తులు లేకుండా డింకీ పందాల కోసం క్రాస్ బ్రీడింగ్ చేస్తున్నారు. ఇతర దేశాల నుంచి కోళ్లను రప్పించి ఇక్కడ క్రాస్ చేస్తున్నారు. తీర ప్రాంతంలో ఇటువంటి పెంపకాలు ఎక్కువగా ఉంటున్నాయి. క్రాస్ బ్రీడింగ్ కోడిపుంజులు అధిక ధరలు పలుకుతున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్, బర్మా దేశాల నుంచి కోళ్లను రప్పించి క్రాస్ బ్రీడింగ్ చేయడం జిల్లాలో ఎక్కువగా కనిపిస్తోంది.

వసతులు హౌస్ ఫుల్

సంక్రాంతి రోజుల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారితో హోటల్స్ రద్దీగా ఉంటాయి.అప్పుడే అడ్వాన్స్ బుకింగ్‌లు చేసుకున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు తదితర ప్రాంతాల్లో సంక్రాంతికి హోటళ్లు భర్తీ అయిపోయాయి. సంక్రాంతి సంబరాలు ఈసారి భారీస్థాయిలో ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పందాల కోసం అధికంగా వస్తారని భావిస్తున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బరులపై ముందస్తు సమాచారం ఇస్తున్నారు.



సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాశ్

ఇవీ ఓట్ల లెక్కలు

కేంద్ర ఎన్నికల సంఘానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ నివేదిక

భీమవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులతో కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాశ్ మంగళవారం విజయవాడలో భేటీ అయ్యారు. జిల్లాలో ఓటర్ల నమోదు, తొలగింపు, బదిలీ వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎం యంత్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, భద్రత తీసుకున్న చర్యలపై చర్చించారు. అధికార, ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలు, వాటిని పరిశీలించి తీసుకున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్‌లు, సున్నితమైన ప్రాంతాలు, శాంతి భద్రతలపై ఎస్పీ రవిప్రకాశ్ కేంద్ర ఎన్నికల సంఘానికి వివరాలను సమర్పించారు. విమర్శలకు తావు లేకుండా సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా, సక్రమంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం దిశా నిర్దేశం చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు 93,714 మంది కొత్త ఓట్ల కోసం నమోదు చేసుకున్నారు. వారిలో 91,561 మందికి నమోదు చేశారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఓట్ల తొలగింపు, అభ్యంతరాలపై 1,00,211 దరఖాస్తులు అందాయి. అందులో 97,390 దరఖాస్తులు పరిష్కరించినట్టు కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల బదిలీపైన మరో 1,26,769 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 1,24,411 దరఖాస్తులను పరిష్కరించారు. జనవరి 22న తుది ఓటరు జాబితాను ఖరారు చేయనున్నారు.

పద్మావతి అమ్మవారికి పసుపు కొమ్ములతో పూజ



భీమవరం టౌన్, జనవరి 9: ధనుర్మాసం సందర్భంగా భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారికి పసుపు కొమ్ములతో పూజలు చేసి అలంకారం చేశారు. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆది నారాయణా చార్యులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈవో గంగా శ్రీదేవి, ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు పాల్గొన్నారు.



భీమవరంలోని హోటల్స్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

హోటళ్లలో ఆహార పదార్థాల తనిఖీ

భీమవరం క్రైం, జనవరి 9 : హోటళ్లలో నిల్వ ఉంచిన, నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ ఆదేశాలతో భీమవరంలో రెండు హోటళ్లు తనిఖీ చేసినట్లు ఏలూరు విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండి రోడ్డులో ఉన్న స్పైస్ మ్యాజిక్, జువ్వలపాలెం రోడ్డులో శ్రీ అభిరుచి హోటల్స్‌లో విజిలెన్స్, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు, తూనికలు కొలతల అధికారులు తనిఖీలు చేశారు. వివిధ ఆహార పదార్థాలలో కృత్రిమ రంగులు కలిపినట్లుగా వచ్చిన అనుమానంతో చికెన్ లాలీ పాప్స్, తందూరి చికెన్, చికెన్ బిర్యాని, చికెన్ ఫ్రై వంటి ఆహార పదార్థాల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు. తూకం మిషన్‌లకు సరైన పత్రాలు లేనందున కేసులు నమోదు చేస్తామని తెలిపారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, ఎస్‌ఐ రంజిత్‌కుమార్, హెచ్‌సీ వెంకటేశ్వరరావు, ఆహార పదార్థాల తనిఖీ అధికారి సుందర్ రామిరెడ్డి, తూనికలు కొలతల అధికారి రాంబాబు పాల్గొన్నారు.

ఏలూరులో ముగ్గురికి కొవిడ్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9 : ఏలూరు నగరంలో ముగ్గురికి కొవిడ్ పాజిటివ్ మంగళవారం నిర్ధారణ అయింది. వీరిలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అందరూ 40 ఏళ్ల వయసుగల వారేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వీరంతా హోం ఐసొలేషన్‌లో ఉన్నారని, ఆరోగ్యం స్థిరంగా ఉందని వివరించాయి. వీరి నుంచి సేకరించిన శ్వాబ్ నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా వేరియంట్‌ను గుర్తించేందుకు విజయవాడలోని స్టేట్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు.



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

సీపీఎం అడుగులు ఎటు వైపు ?

ప్రజా ఉద్యమాల్లో నిరంతరం మునిగితేలే వామపక్షాలు ఎన్నికల వేళ ఇక బరిలోకి దిగే వ్యూహానికి పదును పెడుతున్నాయి. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఏలూరులో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మరో రెండు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో తమ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలో సుదీర్ఘ చర్చ జరగనుంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి దీటుగా నిలబడే దిశగా సీపీఎం అడుగులు వేస్తున్నది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరులో రాష్ట్ర కార్యవర్గం భేటీ
రెండు రోజులపాటు సమావేశాలు
ప్రజాందోళనలు, రాజకీయ అంశాలపై సుదీర్ఘ చర్చ
వచ్చే ఎన్నికల్లో పోటీపైనా నిర్ణయాలకు అవకాశం
ప్రత్యేకంగా రాజకీయ సమీకరణపైనే సమీక్ష

సర్కారు ఏదైనా ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే వాటిపై సీపీఎం, అనుబంధ సంఘాలన్నీ ఎలుగెత్తి, ప్రజా ఉద్యమాలతో తలపడుతాయి. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగున్నరేళ్లగా విరామం లేని ప్రజా ఆందోళనలు చేపట్టింది. ఏనాడూ వెనుకంజ వేయలేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అప్పట్లో జనసేనతో పొత్తుకు లోబడింది. ఆ దిశగానే ఈ రెండు పార్టీల పరస్పర సహకారంతో రణరంగంలోకి దిగాయి. అప్పట్లో ఉండి నుంచి సీపీఎం అభ్యర్థిగా బలరాం పోటీపడి అనూహ్యంగా 30 వేలకుపైగా ఓట్లు లభించడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సీపీఎం తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటూ వచ్చింది. బీజేపీకి వ్యతిరేకంగా సమరశంఖం ఊదింది. ఆ పార్టీకి వ్యతిరేకంగా ప్రజల్లోనూ చైతన్యం కలిగించేలా సుదీర్ఘ ఆందోళనలు చేసింది. కేంద్రంలో ప్రధాని మోదీ విధానాలను తప్పుపట్టింది. ఎర్ర జెండానే ప్రజలకు బాసట అనే దిశగా ఉద్యమాలకు కొత్త ఊపిరి ఇచ్చింది. జగన్ సర్కార్ అక్రమ కేసులు పెడుతున్నా, గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నా, ఆందోళన, ఉద్యమాలకు అడ్డుపడుతున్నా బేఖాతర్ చేస్తూనే సీపీఎం నాయకత్వం ముందడుగు వేసింది. తమకు అనుబంధంగా ఉన్న కార్మిక, ఉద్యోగ సంఘాలన్నింటికి ఈ పార్టీనే అండగా నిలబడుతూ ఆందోళన కొనసాగిస్తూ వచ్చింది. ఉద్యోగులకు అన్యాయం జరిగితే ఉద్యమశంఖం ఊదింది. ఉపాధ్యాయులకు ఎక్కడైనా నష్టం వాటిల్లినా, జీతభత్యాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఉద్యమాలకు వెనుకాడలేదు. ఇప్పుడేమో మునిసిపల్ కార్మికులు ఒకవైపు, అంగన్‌వాడీలు ఇంకోవైపు, సమగ్రశిక్ష ఉద్యోగులు మరోవైపు ఉద్యోగ సంఘాలు రాష్ట్రం నలుదిశగా ఆందోళనలకు దిగితే బాసటగా నిలుస్తుంది వామపక్షాలే. ప్రత్యేకించి సీపీఎం అనుబంధ కార్మిక సంఘాలు ఉద్యమాలకు మరింత ఊపిరి పోస్తూ అందరికీ ధైర్యాన్ని ఇస్తూ సర్కారుకు వెరవకుండా, షోకాజులకు బెదరకుండా జజ్జనక జనారే అంటూ ముందడుగు వేస్తూనే ఉంది.

రెండు రోజులపాటు సమగ్ర చర్చ..

ఏలూరులోని కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో రెండు రోజులపాటు సాగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన సమగ్రంగా కార్మిక, ఉద్యోగ, సమగ్రశిక్ష ఉద్యోగ సంఘాల ఉద్యమాలపై చర్చించబోతున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రజా ఆందోళనలు, జగన్ సర్కార్ అరాచకాలు, వేధింపులు, ఒత్తిళ్లపైన కార్యవర్గంలో చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకోబోతున్నారు.పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వి.రాఘవులు, ఎం.బేబితో సహా 80 మంది ప్రతినిధులు కార్యవర్గ సమావేశంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే ప్రతినిధులు కొందరు ఏలూరుకు చేరుకోగా, బుధవారం నాటికి మిగతా వారంతా చేరుకోబోతున్నారు. కార్యవర్గ సమావేశం జరిగే ప్రాంగణాన్ని అంతా పార్టీ పతాకాలతో నింపేశారు.

రాజకీయ అంశాలపై ఓ నిర్ణయానికి..

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ ఎలా వ్యవహరించాలో ఒక నిర్దిష్టమైన నిర్ణయానికి వీలుగా పలు అంశాలను కార్యవర్గం చర్చించబోతుంది. గతంలో జనసేన, వామపక్షాలు ఉమ్మడిగా కూడబలుక్కుని ఎన్నికల్లో మిగతా పక్షాలతో తలపడ్డాయి. బీజేపీని ఆసాంతం వ్యతిరేకించే పక్షాలతోనే తమ అడుగులు వేయాలని మొదటి నుంచి వామపక్షాలు ఓ నిర్ణయానికి వచ్చి ఆ విధానాన్నే కొనసాగిస్తున్నాయి. ఒక దశలో తెలుగుదేశం, జనసేనతో కలిసి నడిచే అవకాశాలపై పార్టీలోను అక్కడక్కడ రాజకీయేతర చర్చ జరిగింది. ఇంకోవైపు టీడీపీ, జనసేనతోపాటు బీజేపీ పొత్తు పెట్టుకుంటే రాజకీయ సమీకరణలే పూర్తిగా మారబోతున్నాయి. ఇక అలాంటి పరిస్థితే వస్తే వామపక్షాలు అడుగులు ఒంటరిగా వేస్తారా, లేకుంటే కాంగ్రెస్‌తో జతకడతారా అనే దానిపైనే ఇప్పుడు ఊహాగానాలు సాగుతున్నాయి. తెలంగాణ ఎన్నికల్లో జరిగిన అనుభవాలను దృష్టిలోపెట్టుకుని ఒక వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతున్నారనేది పార్టీలో ఓ అంచనా.

అభివృద్ధిపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఏలూరు టూ టౌన్, జనవరి 9: జిల్లా సమగ్రాభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధిలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఏలూరు కాశీ విశ్వేశ్వరరావు కల్యాణ మండపంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళవారం జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన మంగళవారం ప్రారంభ మయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం జిల్లా అభివృద్ధికి దూరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు మూడు లక్షలకు పైగా ఉన్నాయన్నారు. ఈ భూములను భూమిలేని ఆరు లక్షల వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. భూయాజమాన్య హక్కుచట్టం వల్ల రైతులు నష్టపోతారని అన్నారు. ఎమ్మెల్సీ ఈ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా, వైద్యం రాష్ట్రంలో ఖరీదైపోయాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. తొలుత ప్రభుత్వాసుపత్రి నుంచి కల్యాణ మండపం వరకు కవాతు నిర్వహించారు. కళాకారుల నృత్యం, డప్పులు, పాటలు ఆకట్టుకున్నాయి. శ్రీనివాస్, కిషోర్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు



భయం గుప్పిట తీరప్రాంత వాసులు
పెరుగుతున్న సముద్ర కోత

వయసు రాకుండా వివాహం చేస్తే రూ.లక్ష జరిమానా

ఏసీబీ వలలో వీఆర్వో
లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఏసుబాబు 7



అడ్డుకట్టకు మోక్షమెప్పుడో..?



సముద్ర కోత నివారణకు అడ్డుకట్ట పనులు ముందుకు సాగడం లేదు. ఇంకా చెన్నై ఐఐటీ నిపుణులు పరిశోధన చేస్తూనే ఉన్నారు. మరోవైపు ప్రతిఏటా తుఫాన్‌లు, భారీ వర్షాలకు కోత మరింత పెరిగిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే అర కిలోమీటర్ మేర సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. దీంతో తీరప్రాంత వాసులు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. పనులు మొదలు పెడితే కోతనివారణ కొంతమేరైన తగ్గుతుందని ఎదురు చూస్తున్నారు.

- పెరుగుతున్న సముద్ర కోత
- భయం గుప్పెట్లో తీరప్రాంత వాసులు
- ప్రకృతి వైపరీత్యాల్లో ముందుకు చొచ్చుకొస్తున్న వైనం

నరసాపురం, జనవరి 9: గడిచిన పదేళ్ల నుంచి తీర ప్రాంతంలో సముద్ర కోత ప్రతిఏటా పెరుగుతూ వస్తుంది. ఇప్పటికే చినలంక గ్రామం సముద్రగర్భంలో కలిసిపోయింది. కనీసం ఆ గ్రామ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. దీంతో గ్రామ స్థులు వేములదీవి శివారున తలదాచుకుంటున్నారు. ఇటు పీఎంలంక గ్రామం సముద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండేది. ప్రస్తుతం ఈ దూరం అరకిలోమీటర్ కు వచ్చేసింది. ప్రకృత్తి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా కోత పెరుగుతూ వస్తుంది. గతంలో సముద్రానికి ఒక కిలోమీటర్ దూరంలో ఆలయం ఉండేది. నేడు సముద్ర గర్భంలో కలిసిపోయింది. ఇటీవల మరో ఆలయాన్ని నిర్మించారు. ఆ సమయంలో అరకిలోమీటర్ దూరంలో ఉంది. ప్రస్తుతం సముద్రానికి 100 మీటర్ల దూరంలో ఉంది. ఇలా కోత పెరుగుతుండడంతో ఏదో ఒక రోజు తమ గ్రామం కూడా చినలంక మాదిరిగా కడలిగర్భంలో కలిసిపోతుందన్న భయం పీఎంలంక వాసుల్లో నెలకొంది.

కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ హామీ..

ఎనిమిదేళ్ల క్రితం కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి పనులు చేశారు. దేశంలోనే పీఎంలంక గ్రామం దత్తత గ్రామాల్లో అదర్శంగా నిలిచింది. గ్రామస్థులు సముద్ర కోతను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్వయంగా పరిశీలించి కోత నివారణకు డీఆర్‌డీఏ శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించారు. ఓడరేవుల్లో ఉండే విధంగా కోత నివారణకు సముద్రం పొడవున సిమెంట్ రాళ్లు వేయాలని సూచించారు. దీని అంచనా వ్యయం వందల కోట్లు ఉండటంతో ఈ పనులు ముందుకు సాగలేదు. గత ఏడాది నవంబరులో మళ్లీ ఆమె గ్రామానికి విచ్చేసినప్పుడు తరుముకొస్తున్న ప్రమాదాన్ని గ్రామస్థులు మంత్రికి గుర్తు చేశారు. స్పందించిన ఆమె చెన్నై ఐఐటీ నిపుణుల చేత పరిశోధనలు చేయించారు. నివారణ పనులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ డెలైట్ ముందుకొచ్చింది. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తొలి విడత 1,000 మీటర్ల మేర చేపట్టే పనులకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటిచింది. ఇందుకు సుమారు రూ. 15 నుంచి రూ.20 కోట్లు ఖర్చవుతుందని అంచన వేశారు.

ఇంకా పరిశోధనలోనే..

గత ఏడాది నుంచి చెన్నై ఐఐటీ నిపుణులు పలు మార్లు గ్రామాన్ని సందర్శించారు. కోతకు గల కారణాలు, నివారణ చర్యలపై అధ్యయనం చేసి సూచనలు చేశారు. ముంబై తరహాలో ట్యూబ్‌ల్లో రసాయనాలు నింపి గోడ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదం ఎక్కువ ఉన్నచోట్ల పెద్దపెద్ద సిమెంట్ రాళ్లతో గోడ ఏర్పాటు చేస్తే కొంతమేర నివారించవచ్చునని సలహా ఇచ్చారు. అయితే నిపుణులు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రారంభానికి నోచుకోలేదు. మరోవైపు ముందుకు సాగకపోవడంపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. సముద్రంలో ఇసుక మేటలు పెరిగిపోవడంతో ఓవైపు కోతకు గురౌతుందని, తొలుత దీన్ని నివారిస్తే ఫలితం ఉంటుందని అంటున్నారు. ఈ పనులు చేయాలంటే డ్రెడ్జింగ్ చేయాలి, ఇందుకు రాష్ట్రం లేదా కేంద్రం నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఈ పనులు చేసిన తరువాత అడ్డుకట్ట పనులు ప్రారంభిస్తే కోత నివారించవచ్చునని మరో పరిశోధన బృందం సూచించినట్లు తెలిసింది.

34 ఎయిడెడ్ పాఠశాలల మూసివేత !

జీరో ఎన్‌రోల్‌మెంటే కారణమని విద్యా శాఖ వివరణ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9 : జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 34 ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలను మూసివేసేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 24, ఏలూరు జిల్లాలో 10 ప్రైమరీ స్కూళ్లను 2022-23 విద్యాసంవత్సరం యూ-డైస్ లెక్కల ప్రకారం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను, ప్రస్తుత విద్యాసంవత్సర ఎన్‌రోల్‌మెంట్‌ను సరిపోల్చుకుని జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నందున వీటి మూసివేతకు ఉత్తర్వులు ఇవ్వాలని ఉన్నతాధికారులు జిల్లాకు ఆదేశాలు పంపారు. ఈ విషయాన్ని డీఈవో శ్యాంసుందర్ ధృవీకరించారు. తాజా ఉత్తర్వుల మేరకు ఈ నెల 21లోగా 34 ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో మరోదఫా ఎన్‌రోల్‌మెంట్‌ను భౌతికంగా పరిశీలించి కనీస సంఖ్యలో కూడా బాలబాలికలు లేనట్టయితే వాటి మూసివేతకు ఆదేశాలను ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసేలోగా ఇస్తామని డీఈవో తెలిపారు. విద్యార్థులు నష్టపోకుండా సమీప ఆవాసప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తామని వివరించారు. కేడర్ స్ట్రెంగ్త్ ప్రకారం వున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటుచేస్తామన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామారావు

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 9 : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.వి.రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీపీ స్కూల్(మెయిన్)లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నూతన పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతున్నందున వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలను, సరెండర్ సెలవు నగదు విడుదల చేయాలన్నారు. ప్రతినెల ఒకటినే జీతాలు చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడుతూ, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఐటీడీఏ యాజమాన్యంలోని పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను మంజూరు చేయాలన్నారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు యు.వి. నరసింహారాజు, బి.శ్యాంసుందర్, జె.సోమేశ్వర శాస్త్రి, పీవీఆర్ రాజ్యలక్ష్మి, ఎస్.దొరబాబు, వి.గణేష్, ప్రకాష్‌రావు, ఎన్.భాస్కర్ వర్మ, టి.నారాయణదాస్, పి..జగదీష్, ఐ.వి.రత్నం, కె.సుబ్బారావు, ఎం.వర కుమార్, అబ్బులు, నాగేశ్వరరావు, దయరాజు, ఖండియ్య, శ్రీరాములు, ఎస్.ధర్మరాజు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 9: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్‌కు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం (టీఎన్ఏయూ) లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందించింది. కోయంబత్తూరులో ఉద్యాన రంగంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా టీఎన్ఏయూ వైస్ చాన్సలర్ వి.గీతాలక్ష్మి అందజేశారు. జానకీరామ్ 31 ఏళ్లుగా ఉద్యాన పరిశోధనా రంగంలో చేసిన కృషికి, నాయకత్వ ప్రతిభకు ఈ అవార్డు నిదర్శనం. చామంతి పూలలో పది రకాలు, లిల్లీ పూలలో నాలుగు హైబ్రిడ్ రకాలను, చైనా యూస్టర్‌లో ఆరు రకాలను, గ్లాడియోలస్‌పూలలో 10. ఇలా రకరకాల నూతన వంగడాలను జానకీరామ్ సృష్టించారు. రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, ఇతర అధికారులు జానరామ్‌ను అభినందించారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పరిపాలన



మాట్లాడుతున్న డీపీవో విశ్వనాథ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9: ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ పరిపాలన జరిగితే నిజమైన గ్రామస్వరాజ్యమని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ అన్నారు. జిల్లాపరిషత్ మందిరంలో పరిపాలన అధికారులకు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి కోఆర్డినేటర్స్‌కు రెండురోజుల శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో వెంకటసుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. శాఖలవారీగా అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధి ప్రణాళికల తయారీలో మహిళా భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రసంగి రాజు, డీఎల్‌పీవోలు చంద్రశేఖర్, సుందరి, డీపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

సామాజిక సమతకు విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలో సామాజిక సమత కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ ఆర్.విజయ్‌రాజు తెలిపారు. తన కార్యాలయంలో సామాజిక సమతా సంకల్పం నిర్వహణ ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ జిల్లాస్థాయిలో కమిటీని ఏర్పాటుచేసి సంబంధిత అధికారులకు దిశనిర్దేశం చేశారు. ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం ఈనెల 18వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో విశ్వనాథ్, సోషల్‌వెల్ఫేర్ అధికారి జయప్రకాష్ పాల్గొన్నారు.

స్వ్యాయ్ పోటీల్లో ఏలూరు విద్యార్థులకు పతకాలు



పథకాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు స్పోర్ట్స్ జనవరి 9: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఈనెల నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో 24వ జాతీయస్థాయి స్వ్యాయ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. వివిధ విభాగాల్లో ఏలూరుకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్ -14 బాయిస్, గరల్స్ విభాగంలో భార్గవ్ బంగారు పతకం, ఎమ్డీఓవైస్ బంగారు, ఏఎమ్‌రావ్ స్కై విభాగంలో శ్రీనివాస్ స్వర్ణపతకం సాధించగా, బాలికల విభాగంలో రమ్యశ్రీ స్వర్ణపతకం సాధించింది. అండర్ -18 బాలబాలికల విభాగంలో ఎమ్డీ అహ్మద్‌రాజా స్వర్ణపతకం, జయంత్ లోబోలో రెండోస్థానం సాధించగా, జి.అఖిల మూడోస్థానం సాధించినట్లు స్వ్యాయ్ కోచ్ ఎమ్డీ ఖాజా తెలిపారు. స్వ్యాయ్‌లో బంగారు పతకాలు సాధించిన వీరిని నిర్వాహకులు, నగర ప్రముఖులు, క్రీడాకారులు అభినందించారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

భీమడోలు, జనవరి 9 : పలు రేషన్ దుకాణాల్లో మంగళవారం విజిలెన్సు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 6,500 కేజీల బియ్యంతో పాటు 72 ప్యాకెట్ల షుగర్, 33 కేజీల ఆటాలను స్వాధీన పర్చుకున్నారు. రికార్డుల లెక్కలకు, స్టాకు లెక్కలకు తేడాలు ఉండడంతో బియ్యాన్ని స్వాధీన పర్చుకుని సీజ్ చేసినట్లు సివిల్ సప్లై డీటీ మాధవరావు తెలిపారు. భీమడోలులో డీలర్లు కేతినీడి దుర్గాపల్లవి, మద్దాల వెంకటరత్నం దుకాణాలను తనిఖీలు చేశారు. అలాగే సంబంధిత రేషన్ పంపిణీ వాహనాల డ్రైవర్లు గోపిశెట్టి విజయరత్నం, పడాల నాగమోహన్‌పై కూడా 6ఏ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

యుక్త వయసు రాకుండా వివాహం చేస్తే రూ.లక్ష జరిమానా



మాట్లాడుతున్న డీసీపీవో సూర్యచక్రవేణి

పెదవేగి, జనవరి 9 : ఆడపిల్లలకు కనీస వయసు రాకుండా వివాహం చేస్తే బాల్య వివాహన నిరోధక చట్టం కింద రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష అమలు చేస్తారని జిల్లా బాలల సంరక్షణాధికారిణి (డీసీపీవో) సిహెచ్.సూర్యచక్రవేణి చెప్పారు. అమ్మపాలెంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో- బేటీ పడావో' (ఆడపిల్లలను రక్షిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాం) కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ చట్టంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు ఎంత తొందరగా పెళ్లి చేసి పంపిస్తే అంత మంచిదనే భావనతో కొందరు తల్లిదండ్రులు కనీస వయస్సు రాకుండానే పెళ్లి చేస్తున్నారన్నారనీ ఇది సరైన విధానం కాదన్నారు. కనీస వయసు 18 ఏళ్లు నిండాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి 18 ఏళ్ల లోపు బాలికల వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేసి, వారిని నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. బాలికల సంక్షేమం విద్యతోనే సాధ్యమన్నారు. బాలికావిద్యకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యావంతులైతేనే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణం సమాచారం అందించాలని సూర్యచక్రవేణి పేర్కొన్నారు. క్రాప్ ఎన్జీవో ప్రతినిధి ఎస్.రవిబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ వైవీ.రాజు, పంచాయతీ కార్యదర్శి విజయ్ రమేష్, మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎం.కావ్య, కుసుమ, కె.సౌజన్య, డీసీపీయూ కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఇళ్ల ప్లాన్ అప్రూవల్ అందని ద్రాక్ష!

- వీరవాసరం పంచాయతీలో పెండింగ్‌లో 70..
- అమలుకాని నిబంధనలు.. ఆవేదనలో గృహ నిర్మానదారులు

వీరవాసరం, జనవరి 9: భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వటం వలన ఫీజు రూపేణా పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. ప్రణాళికాబద్ధ గ్రామాభివృద్ధితో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవచ్చు. నిబంధనల మేరకు గ్రామంలో 300 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం కలిగిన స్థలంలో నివాసయోగ్య భవన నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇవ్వవచ్చు అని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఈయూడీఏ) స్పష్టమైన సూచనలు ఇచ్చింది. 300 చదరపు మీటర్ల విస్తీర్ణం పైబడిన భవనాలు, షాపింగ్, కమర్షియల్ భవనాలకు ఈయూడీఏ అనుమతి తప్పనిసరి అని మార్గదర్శకాలను నిర్దేశించింది. భవన నిర్మాణానికి పంచాయతీ బోర్డు సమావేశాల్లో ఆమోదించవలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ వీరవాసరం పంచాయతీలో నిబంధనలు అమలు కావటం లేదు. గృహ నిర్మాణదారులు ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేస్తే అనుమతి లభించటం లేదు. తొమ్మిది నెలల కాలంగా ప్లాన్ అప్రూవల్ కోసం వచ్చిన సుమారు 70 ఇళ్ల ప్లాన్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీనికి కారణం పంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన గ్రామ కార్యదర్శి లేకపోవటమేనని చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది అయితే తాత్కాలిక కార్యదర్శులు చార్జ్ అప్పగించలేదని, రికార్డులేదని బాహాటంగా చెబుతున్నారు.

2022 ఏప్రిల్, జూన్ నెలల్లో అప్పటి కార్యదర్శి డి.శ్రీనివాసరాజు సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆరుగురు కార్యదర్శులు ఇక్కడ విధులు నిర్వర్తించలేమంటూ వెళ్లిపోయారు. ప్రస్తుతం ఏజో కార్యదర్శిగా ఈవోపీఆర్డీ విజయశారధిని నియమించారు. అయినప్పటికీ ప్లాన్ అప్రూవల్‌కు మోక్షం కలగటం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. అధికారులకు ఫిర్యాదు చేసుకోండి అని దురుసుగా సమాధానం ఇస్తున్నారని గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిఫారసులు ఉంటే చాలు..

పంచాయతీ కార్యదర్శిగా జె.డి.వి. ప్రసాద్.. ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు ఈవోపీఆర్డీగా పదోన్నతి రావటంతో వేరే మండలానికి బదిలీపై వెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ప్లాన్ అప్రూవల్స్‌ను కొందరు గృహనిర్మాణదారులు నియోజవర్గస్థాయి ప్రజాప్రతినిధులతో సిఫారసు చేయించుకొని పంచాయతీలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కొందరికి అప్రూవల్ ఇచ్చారని సమాచారం. కొందరు ప్లాన్ అప్రూవల్ లేకుండానే ఇంటి నిర్మాణాలు పూర్తిచేసేశారు. బ్యాంకు రుణాలు ఆశించే మరి కొందరు అప్రూవల్ కోసం పంచాయతీ చుట్టూ తిరుగుతున్నారు.

ఏసీబీ వలలో వీఆర్వో

- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఏసుబాబు



పట్టుబడిన వీఆర్వో

పెనుగొండ, జనవరి 9: సిద్ధాంతంలో ఓ రైతు నుంచి వీఆర్వో జంపా ఏసుబాబు రూ.ఎనిమిదివేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ శరత్ బాబు వివరాలు వెల్లడించారు. సిద్ధాంతం శివారు ఘటాలదిబ్బకు చెందిన మామిడిశెట్టి సత్యనారాయణకు తన పట్టాదారు పాసు బుక్‌లో ఉన్న 0.50 సెంట్ల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో 0.30ట్లు భూమి మాత్రమే ఉండటంతో మిగిలిన 0.20 సెంట్ల భూమి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆన్‌లైన్ 0.20 సెంట్లు అప్‌లోడ్ చేయడానికి వీఆర్వో రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. గత నెలలో రూ.రెండు వేలు లంచం ఇచ్చారు. మిగిలిన ఎనిమిదివేల కోసం ఆఫీసు చుట్టు తిప్పించుకున్నాడు. విసుగుచెందిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వీఆర్వో ఏసుబాబు రూ. 8 వేలు లంచం తీసుకుంటుండగా మంగళవారం రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నామని డీఎస్పీ వివరించారు. ఏసీబీ సీఐలు ఎన్.వి. భాస్కరరావు, నాగేంద్రబాబు, శివ ప్రసాద్, హ్యాపీ కృపానందం, సిబ్బంది ఉన్నారు.

పెనుగొండ తహసీల్దార్ కార్యాలయంలో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగుల జేబులు చెక్ చేసి రికార్డులను పరిశీలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.



అభినందిస్తున్న వీసీ

ఎన్ఎస్ఎస్ సాహసయాత్ర విజయవంతం

రాజమహేంద్రవరం, జనవరి 9: యువజన వ్యవహారాల క్రీడాశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ కేంద్రం పోంగ్‌డామ్ వద్ద నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సాహసయాత్రను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విజయవంతంగా పూర్తిచేశారని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. గత నెల 19 నుంచి 28 వరకు ఈయాత్ర సాగిందన్నారు. నన్నయ వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఒక పీవో హాజరయ్యారన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.రాజశేఖర్, కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ నుంచి ఐ.ఆనందబాబు, నన్నయ క్యాంపస్ నుంచి ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం నుంచి జి.ఆది, భీమవరం బీవీ రాజు కాలేజ్ ఆఫ్ సైన్స్ నుంచి పి.దుర్గాగణేష్, గైట్ కళాశాల నుంచి సిహెచ్. చరిష్మా, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి పి.సాయిరత్నం, కిర్లంపూడి ఎస్వీపీఎస్ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.ఉష, రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి కె.హర్షిణి, పాలకొల్లు డీఎన్ఆర్ మహిళా కళాశాల నుంచి ఎస్.లక్ష్మీదేవి పాల్గొన్నారన్నారు. మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా తమ సాహసయాత్రను కొనసాగించారని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు అభినందించారు.

తొళక్క వాహనంపై శ్రీవారికి తిరువీధిసేవ



స్వామికి హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, జనవరి 9: చినవెంకన్న క్షేత్రంలో ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని స్వామివారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అనంతరం విలాస మండపంలో ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. తొలుత గోదాదేవి, ఉభయదేవేరులతో శ్రీవారిని తొళక్కవాహనంలో ఆశీనులుగావించి పుష్పాలంకారం చేశారు. అనంతరం అట్టహాసంగా క్షేత్ర తిరువీధుల్లో గజ, అశ్వసేవల నడుమ గ్రామోత్సవం జరిపారు. భక్తులకు కనువిందు చేసింది.

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం



నందివాహనంపై ఊరేగుతున్న శివుడు

నందివాహనంపై కొలువైన శివయ్య మంగళవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం భక్తులను అలరించింది. తొలుత ఆలయపరిసరాలను పుష్పమాలికలు, మామిడితోరణాలతో సుందరీకరించారు. గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషే కాన్ని నిర్వహించారు. రాత్రి నందివాహనంపై జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది.

మావుళ్లమ్మ ఆదాయం రూ.27.47 లక్షలు

భీమవరంటౌన్, జనవరి 9 : మావుళ్లమ్మ ఆలయ హుండీలను మంగళవారం లెక్కించగా రూ. 27,47,385 ఆదాయం లభించిందని దేవస్థానం సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. 64 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 153 గ్రాముల 700 మిల్లీగ్రాముల వెండి వచ్చిందని వివరించారు. 40 రోజులకు ఈ ఆదాయం లభించిందన్నారు. దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్థినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ముత్యాల వెంకట రామరావు, చెల్లంకి నాగేషగిరి, మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, నీలాపు వెంకట లక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు ఉన్నారు.

గాంధేయవాదంపై కవితా రచనల పోటీలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9 : మహాత్మాగాంధీ వర్థంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో సీనియర్ రచయితలకు కవితా రచనల పోటీలను నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మనది గాంధేయవాదం-రావాలి గాంధీయుగం' అనే అంశంపై 25 ఏళ్లు దాటిన రచయితలందరూ పోటీలో పాల్గొనవచ్చునన్నారు. 40 పంక్తులకు మించకుండా రచనలను డీటీపీచేసి ఈ నెల 25లోగా కార్యదర్శి, సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 చిరునామాకు పోస్టుద్వారా పంపాలని కోరారు. విజేతలకు ఈ నెల 30న పెదనింద్రకొలనులోని మహాత్మాగాంధీ భవన్‌లో నిర్వహించే కవిసమ్మేళనం సందర్భంగా గా బహుమతులు అందజేస్తామని వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

యలమంచిలి, జనవరి 9: క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయని తహసీల్దారు యం.సునీల్‌కుమార్, ఎంపీడీవో సిహెచ్.త్రిశూలపాణి అన్నారు. మూలస్థానేశ్వరి అమ్మవారి సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆకుల దొరబాబు మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను వీరు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, యువత క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవాలన్నారు. యువతను ప్రోత్సహించేందుకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ టోర్నమెంటులో 20 జట్లు పోటీపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. తాళ్లూరి బుజ్జిబాబు, సర్పంచ్ మేరీ, చిలుకూరి రాజ్యలక్ష్మి, పాలా శ్రీనివాస్, బొప్పన రాంబాబు, తాళ్లూరి చందు, సిద్దాని రాము, ఆకుల ఏసు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహితపై అత్యాచారం..కేసు నమోదు

ఉండి, జనవరి 9 : వివాహితపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. స్థానిక చిక్కాలవీరన్ననగర్‌కు చెందిన వివాహితకు 1995లో వివాహమైంది. ఆమెకు ఓ కుమారుడు వున్నాడు. ప్రస్తుతం భర్తతో విడిపోయి ఆమె వేరుగా జీవిస్తోంది. గ్రామంలోనే ఉన్న తన సోదరుడితో కలిసి వుంటోంది. అతడి స్నేహితుడు కారుమూరు వీరవెంకటసత్యప్రదీప్‌కుమార్ (44) తరుచూ బాధితురాలి సోదరుడి కోసం వస్తువెళ్తుంటాడు. ఈనెల ఏడవ తేది రాత్రి ఇంట్లో ఆమె ఒక్కతే ఉంది. ఆ సమయంలో ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఆమె కుటుంసభ్యులకు చెప్పింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఉండి ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష

నరసాపురం/పోడూరు, జనవరి 9: మద్యం మత్తులో హత్యాయత్నం చేసిన నిందితుడికి నాలుగేళ్లు జైలుశిక్ష, రూ.100 జరిమాన విధిస్తూ మంగళవారం నరసాపురం కోర్టు తీర్పు చెప్పింది. లైజన్ అధికారి ఉభయభాస్కర్‌రావు వివరాల ప్రకారం.. పాలకొల్లుకు చెందిన వడ్డాది ఏసు, శరత్‌బాబుల మధ్య పాత గొడవలు ఉన్నాయి. శరత్‌బాబు ట్రాన్స్‌జెండర్. రోడ్డుపై వెళ్లే వారిని డబ్బులు అడుగుతాడు. ఇవ్వకపోతే గొడవ పడతాడు. ఈక్రమంలో గత ఏడాది జూలైలో పట్టణంలో స్వాగత్ బార్ వెనుక ఏసును చూసి డబ్బులు అడిగాడు. ఏసు నిరాకరించడంతో పక్కనేఉన్న చెక్కతో శరత్‌బాబు తలపై బాదాడు. పీక పట్టుకుని గోడకేసి కొట్టాడు. మూతి, మోహంపై గుద్ది కిందపడేసి కొడుతుండగా సమీపంలో ఉన్న కొందరు చూసి కేకలు వేశారు. దీంతో శరత్ పారిపోయాడు. ఏసును ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించడంతో అతడు కొలుకున్నాడు. అప్పటి పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్ ఏసు స్టేట్‌మెంట్ రికార్డు చేసి శరత్‌బాబుపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెక్షన్ జడ్జి వై. శ్రీనివాసరావు నిందితుడికి పైన పేర్కొన్న విధంగా శిక్ష విధించినట్లు భాస్కర్‌రావు చెప్పారు. నేరం రుజువు చేయడంలో పీపీ నల్లిమిల్లి జోసఫ్, వంశీధర్ కీలకంగా వ్యవహరించారన్నారు.

కోడికత్తులు తయారీ.. వ్యక్తి అరెస్టు

కొయ్యలగూడెం, జనవరి 9: కోడికత్తులు తయారు చేస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివి. కన్నాయిగూడెంలో ఓ వ్యక్తి కత్తులకు సానపడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడిచేసి అతడిని పట్టుకున్నారు. 102 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా కోడికత్తులు తయారుచేసిన, అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విష్ణువర్ధన్ హెచ్చరించారు.

25 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం/పెదవేగి, జనవరి 9 : వేర్వేరు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 25 మందిని అరెస్ట్ చేశారు. వివరాలివి. ఏలూరు ఆర్ఆర్‌పేటలో ఓ ఇంట్లో పేకాట టూటౌన్ సీఐ ప్రభాకర్‌కు సమాచారం అందింది. ఎస్ఐలు సాధిక్, శుభశేఖర్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి దాడి చేశారు. పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.38 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు సీఐ ప్రసాద్ కుమార్ తన సిబ్బందితో లింగపాలెం మండలం వేములపల్లిలో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి రూ.10,600 నగదు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు తదుపరి చర్యలు నిమిత్తం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసి, వారివద్దనుంచి రూ.5,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.విజయరాయిలో ముగ్గరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1700 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ చెప్పారు. కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

చేపల లారీ బోల్తా.. డ్రైవర్ మృతి



ఖమ్మంరూరల్, జనవరి 9: చేపల లోడుతో వెళుతున్న ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడటంతో డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా, ఖమ్మంరూరల్ మండలం, ఆరెంపుల గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు పట్టణం నవాబ్‌పేట్ ప్రాంతానికి చెందిన మారడాని బాలబాలాజీ (38) లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. క్లీనర్ తానికొండ నరేష్ కుమార్‌తో కలిసి చేపలలోడుతో ఏలూరు నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు వెళుతున్నాడు. మార్గం మధ్యంలో ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టి బోల్తాపడింది. డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎస్ఐ సురేష్ ఘటన స్థలాన్ని సందర్శించారు. అన్నం ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌రావు బృందం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీని ఎక్స్‌కవేటర్‌తో బయటకు తీశారు. వేరే లారీలో చేపలను లోడు చేసి పంపించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్రాంతి సంబరాలు







ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యలమంచిలిలో ముగ్గుల పోటీల్లో విజేతలతో ఎమ్మెల్యే నిమ్మల... భీమవరం ఎస్ఆర్కెఆర్‌లో డింకీ పందాలు వేస్తున్న కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు.. తణుకు మాంటిస్సోరి స్కూల్, ఆలంపురం టీబీఆర్ స్కూల్, పాలకొల్లు ఆదిత్య స్కూల్‌లో భోగి మంటలు..

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మేలు



పెదకాపవరంలో బాబు ష్యూరిటీ బాండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మంతెన

ఆకివీడు రూరల్ జనవరి 9 : చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. పెదకాపవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన అంతమొంది, ప్రజలు సుఖశాంతులతో జీవించాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోనికి రావాలని అన్నారు. పార్టీ నాయకులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, మర్రివాడ వెంకట్రావు, నంబాళ్ళ రామాంజనేయులు, జాకీర్, అజ్మల్, సుజాత, సరళ, లీలాకుమారి, బొల్లావెంకట్రావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించనున్నట్లు టీడీపీ పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని 18వార్డులో బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బాండ్లను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శశిదేవి, పద్మ, చిన్నయమ్మ, శ్రీనివాస్, గౌరిశంకర్, పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ నాగబాబు

ఆకివీడు రూరల్ జనవరి 9 : క్రీడలు ఒత్తిడిని జయించేలా చేస్తాయని ఎస్ఐ నాగబాబు అన్నారు. దుంపగడపలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉండి, భీమవరం, కైకలూరు నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. 16 టీమ్‌లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంబటి రమేష్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సత్యవతిదేవి, అట్లూరి సంజయ్, గేదెల ధనుష్, బొద్దుపల్లిరాంబాబు, సతీష్, పెంకి అప్పారావు పాల్గొన్నారు.

జనరిక్ మందుల దుకాణం ప్రారంభం

ఆకివీడు, జనవరి 9: రూరల్‌బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణాన్ని మంగళవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ప్రారంభించారు. ఈ షాపులో తక్కువ ధరకు నాణ్యమైన మందులు లభ్యమవుతాయన్నారు. బ్యాంకు చైర్మన్ కేశిరెడ్డి మురళి, మేనేజర్ తోట సతీష్‌బాబు, నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, జడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఐఎంఏ వైద్యులు ఎంవీఎస్‌రాజు, ప్రతాప్‌కుమార్, మహేష్‌వర్మ,బాబు , మోటుపల్లి గంగాధరరావు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయాలి

భీమవరం అర్బన్, జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రజలకు నష్టదాయకం అని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఈ చట్టం ప్రకారం భూ సమస్యలు ఏర్పడితే కోర్టులకు వెళ్ళకుండా రెవెన్యూ శాఖలో అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌ని ఏర్పాటు చేస్తుందన్నారు. సహజంగానే భూ సమస్యలన్ని రెవెన్యూ పరిధిలోనే ఏర్పడతాయన్నారు. వారికే సమస్యలను పరిష్కరించాలంటే దొంగచేతికి తాళాలు ఇవ్వడమేనన్నారు. ఇటువంటి చట్టాని తక్షణమే ప్రభుత్వం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం



మామిడిశెట్టి సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్

భీమవరం అర్బన్, జనవరి 9: టీడీపీ జిల్లా కార్యవర్గ కమిటీలో నరసాపురం నియోజకవర్గానికి చెందిన ఎం.సత్యనారాయణను ఉపాధ్యక్షునిగాను, ఉండి నియోజవర్గానికి చెందిన జుత్తిగ శ్రీనివాస్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రకటించారు.

జేసీని కలిసిన ఆహార కమిషన్ సభ్యుడు



జేసీతో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

భీమవరం, జనవరి 9 : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఇండెల లక్ష్మీరెడ్డి మంగళవారం నాడు జాయింట్ కలెక్టరు ఎస్. రామ సుందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ జిల్లా పర్యటనలో భాగంగా లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సివిల్ సప్లయిస్ గొడౌన్, నరసాపురం మండలం రుస్తుంబాదలో మునిసిపల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను తనిఖీ చేసినట్టు తెలిపారు.

మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

మొగల్తూరు, జనవరి 9: జలజీవన్ నిధులు రూ.85 లక్షలతో రామన్నపాలెంలో చేపట్టే మంచినీటి పైప్‌లైన్ పనులకు మంగళవారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకనవారితోటలో రూ.18లక్షలు, జెట్టిపాలెంలో రూ.14లక్షలు, లక్కువారితోటలో రూ.15.40, పివితోటలోట రూ.12.80, పులపర్తివారితోటకు 12.40, రామన్నపాలెంలో రూ.13.20 లక్షలతో పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తామన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి రూ. లక్షా 16 వేల సాయం



విద్యార్థిని వైద్యానికి చెక్కు అందిస్తున్న దృశ్యం

ఆచంట, జనవరి 9: పెనుమంచిలి నెహ్రూనగర్‌కు చెందిన శీలం దివ్య అనే నాల్గవ తరగతి విద్యార్థిని లివర్ క్యాన్సర్‌తో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఆపరేషన్ నిమిత్తం రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో కొడమంచిలి హోలీ ఏంజెల్స్ స్కూలు విద్యార్థులు రూ.లక్షా 16 వేల చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ రవి కుమార్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, కృష్ణ సాయి సేవా సంఘం సభ్యులు రమణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు సత్యనారాయణ మృతి



ఆచంట, జనవరి 9: జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు, మెడికల్ షాపు యజమాని ఆచంటకు చెందిన జి.సత్యనారాయణ(53) మంగళవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుత్తిందీవి సత్యనారాయణ ఆకస్మిక మృతి పట్ల బీజేపీ అధ్యక్షుడు నార్ని సత్యనారాయణ, మండల చాంబర్ అధక్షుడు కేతా రామకృష్ణ, బీజేపీ నాయకులు ముచ్చర్ల నాగ సుబ్బారావు, గుడాల ఈశ్వర చంద్ర, కొత్త నాగ భూషణం, బసవరాజు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. గుత్తిందీవి ఆకస్మిక మృతి పటట్ల ఆచంటలోని మెడికల్ షాపులను స్వచ్ఛందంగా మూసి వేశారు.

వనితా క్లబ్ సంక్రాంతి సంబరాలు

నరసాపురం టౌన్, జనవరి 9: పట్టణంలోని రాయపేటలో వనితా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా ప్రాంగణాన్ని ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు వేసి సంప్రదాయ పల్లె గీతాలు పాడారు. విద్యార్థుకు భోగి పండ్లు పోశారు. స్కూల్ పిల్లలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్యలక్ష్మి, పుప్పాల ఉమా, స్వర్ణలత, రంగినీడి భరణి, ఉషా, అరుణ, రాజకుమారి, శశికళ పాల్గొన్నారు.





కాళ్ళలో గంగిరెద్దుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు.. తాడేపల్లిగూడెంలో అంగన్‌వాడీల దీక్షలో టీడీపీ కన్వీనర్ బాబ్జి.. ఆకివీడులో నిరసన

అంగన్‌వాడీల వినూత్న నిరసన

ఆకివీడు/కాళ్ళ/ఆచంట/మొగల్తూరు/తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 9: ఆకివీడులో అంగన్వాడీలు కుర్చీలు నెత్తిమీద పెట్టుకొని నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు పెంకి అప్పారావు, మాజీ మెంబర్ అడపా అబ్బులు పాల్గొన్నారు. కాళ్ళలో అంగన్‌వాడీలు గంగిరెద్దుకి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఆచంట కచేరి సెంటర్, మొగల్తూరులలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలోని తాలూకా సెంటర్ వద్ద అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మంగళవారం సందర్శించి మద్దతు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, సబ్నీసు కృష్ణమోహన్, పద్మనాభుని మురళి, ముప్పిడి రమేష్, పసలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 9 : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని 39 వార్డులలో నాలుగున్నరేళ్ళ కాలంలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, త్వరలో టెండర్ ప్రక్రియ జరగనున్న అభివృద్ధి పనుల సంబంధించి సమీక్ష జరిపారు. అమృత పథకంలో నిర్మించిన భారీ మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కాళ్ళ జనవరి 9 : జక్కరం గ్రామంలో రహదారి పనులకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు భూమి పూజ చేశారు. జక్కరం నుంచి ఎల్ఎన్‌పురం వరకు కోటి 76 లక్షల రూపాయలతోను, ఉండి బస్టాండ్ నుంచి వాండ్రమ్ గ్రామం వరకు కోటి రూపాయలతో రహదారుల పనులు జరుగుతున్నాయని తెలియజేశారు.

దుస్తుల పంపిణీ

కాళ్ళ జనవరి 9 : ఎస్టీయూ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కలవపూడి శివారు మోడి ప్రాథమిక పాఠశాలలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాయివర్మ 10 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

మునిసిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నరసాపురంలో కార్మికుల ఆందోళన

నరసాపురం టౌన్, జనవరి 9: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మెలో ఉన్న మునిసిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. మునిసిపల్ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేశారు. అక్కడ కొద్దిసేపు ఆందోళన చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, నెక్కంటి క్రాంతికుమార్, ఆరేటి మృత్యుంజయరావు, ఫణిరాజు పాల్గొన్నారు.

తణుకు: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బొద్దాని నాగరాజు అన్నారు. మంగళవారం 15వ రోజు సమ్మెలో కేశవస్వామి ఆలయ సెంటర్లో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి, కార్మికులు ఆదినారాయణ, ముత్యయ్య, శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: సమస్యలు పరిష్కరించాలంటూ తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం కూడా సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని నినాదాలు చేశారు. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, అధ్యక్షురాలు తాడికొండ కనకమహాలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

నరసాపురం, జనవరి 9: కొత్త భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు భవనం నుంచి శివాలయం, అంబేడ్కర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దానయ్యనాయుడు, అందే ఫణి, ఆర్‌జీ కుమార్, రంజిత్, రఘురాం, బాలాజీ, క్రాంతికుమార్, వనమాల శ్రీను పాల్గొన్నారు.

'కలిసి పని చేద్దాం.. వైసీపీని తరిమికొడదాం'



సమావేశమైన టీడీపీ, జనసేన నాయకులు

నరసాపురం, జనవరి 9: రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టడమే లక్ష్యంగా కలిసి పని చేయాలని జనసేన, టీడీపీలు నిర్ణయించాయి. మంగళవారం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు నివాసంలో కొవ్వలి నాయుడు, జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయక ర్‌లతో పాటు పట్టణ, మండల అధ్యక్షులు సమావేశమయ్యారు. నియోజకవ ర్గంలో రెండు పార్టీల పరిస్థితి, వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, నాలుగేళ్లలో ప్రభుత్వం ఇచ్చి అమలు చేయని హామీలు, వేసిన శిలాఫలకా లపై పోరాటం చేయాలని నిర్ణయించారు. పార్టీ అధిష్ఠానం టిక్కెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పని చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జక్కం శ్రీమ న్నారాయణ, వాతాడి ఉమా, గుబ్బల నాగరాజు, కోటిపల్లి వెంకటేశ్వరావు, జక్కం బాబ్జీ, రాంబాబు, మార్రాజు పాల్గొన్నారు.

11 నుంచి క్రికెట్ పోటీలు

భీమవరం టౌన్, జనవరి 9: ఈ నెల 11,12,13 తేదీలలో డీఎన్ఆర్ కాలేజీకు చెందిన గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గ్రంధి చల్లారావు, దండు శ్రీను తెలిపారు. ఈ పోటీల్లో రంజీ క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

ఫైనాన్సియర్స్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

పాలకొల్లు టౌన్, జనవరి 9: ఫైనాన్సియర్స్ అసోసియేషన్ పాలకొల్లు ఇన్‌చార్జి అధ్యక్షుడుగా పాలకొల్లుకు చెందిన యాతం లక్ష్మీనారాయణను అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫైనాన్సియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పనిచేసిన రేపూరి సూర్యనారాయణ ఇటీవల మృతిచెందటంతో అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్న యాతం లక్ష్మీనారాయణను ఇనిచార్జ్ అధ్యక్షునిగా సభ్యులు ఎన్నుకున్నారు.

వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలుగా బొండాడ

పాలకొల్లు టౌన్, జనవరి 9: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలుగా బొండాడ వినయ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యదర్శిగా బొండాడ కుమారి, కోశాధికారిగా వంకాయల మాలతి ప్రమాణస్వీకారం చేశారు.

అన్నసమారాధన

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 9: వైసీపీ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపాన గల అన్న క్యాంటీన్ వద్ద మంగళవారం డాక్టర్ ఉన్నమట్ల రాజేష్, రజిత నాగపద్మిని దంపతుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. గొర్రెల శ్రీధర్, పద్మనాభుని మురళి, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన పించన్‌లు పంపిణీ

పాలకోడేరు, జనవరి 9 : పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా పింఛన్‌లు మంజూరైన 45 మంది లబ్ధిదారులకు సొమ్మును శృంగవృక్షం గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు అందజేశారు. ఉపసర్పంచ్ కలిదిండి ఆనందరాజు, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వీరవల్లి లక్ష్మణరావు, మాజీ అధ్యక్షుడు పేరిచర్ల కనకరాజు, వార్డు సభ్యులు సోము దుర్గాభవాని, చెలంకూరు సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లుల సూర్యకళ పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరు కావాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమంలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం టౌన్, జనవరి 9 :ఈ నెల 19వ తేదీన విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వ ర్యంలో జరగనున్న అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణలో అందరూ భాగస్వాములు కావాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం అంబేడ్కర్ చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో మోషేన్ రాజు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. యావత్ భారతదేశం గర్వించ దగ్గ నాయకుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆర్డీవో జి.శ్రీనివాసులురాజు, మునిసిపల్ కమిషనర్ యస్.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: వడలి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. శ్రీనివాస్ దొర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు: రామన్నపాలెంలో జరిగిన అంబేడ్కర్ సంఘీభావ సభలో ఎమ్మెల్యే ప్రసాదరాజు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల ఎలీషా, కొల్లాబత్తుల సత్యానందం, కాకిలేటి అనంద్ కుమార్‌పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

ఉండి, జనవరి 9 : మహదేవపట్నంలోని రజకుల చెరువు వంతెన వద్ద నుంచి శివాలయం వరకు ప్రధాన రహదారికి సర్పంచ్ వనిమా వెంకట సుబ్బలక్ష్మీ, ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు భూమిపూజ చేశారు. పంచాయతీ నిధులు రూ.10లక్షలు, జడ్పీ నుంచి రూ.15లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు రూ.10లక్షలు మంజూరు చేయనున్నారని తెలిపారు.

ప్రజా దీవెన కాదు.. ప్రజా వంచన : ఆరిమిల్లి



విలేకరులతో మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, జనవరి 9: మంత్రి కారుమూరి చేస్తున్నది ప్రజా దీవెన యాత్ర కాదని, ప్రజావంచన యాత్ర అని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తణుకులోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు ధాన్యం అమ్ముకోవడానికి కన్నీరు పెడుతున్నారని, ఆ కన్నీటిలో మీరు కొట్టుకుపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. తణుకు పట్టణంలో ఎన్ని టీడీఆర్ బాండ్లు ఇచ్చారో లెక్క తేలుద్దామని, చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, వైసీపీలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామన్నారు. టీడీపీ నాయకులు కలగర వెంకటకృష్ణ, పితాని మోహనరావు, గుబ్బల శ్రీనివాసు, తమరాపు రమణమ్మ, గమిని రామచంద్రరావు, తాతపూడి మారుతీరావు, బట్టపల్లి నాగరాజు, సప్పారాజు, లాజర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 9: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్తంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సంఘ కార్యాలయంలో డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు 40 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, కాయల నాగేశ్వరరావు, కోసూరి గాంధీ, ఇవటూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి వైద్య నిపుణుల రాక

పెంటపాడు, జనవరి 9: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 11న రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, క్యాన్సర్, స్త్రీ సంబంధ, చిన్నపిల్లల, గుండె వైద్య నిపుణులు ఉచితంగా సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రా సౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెంటపాడు, జనవరి 9: పెంటపాడులోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ యూవీ సుబ్బారెడ్డి ప్రధాన పరిశోధకులుగా డీఎస్‌టీ సెర్బ్‌కు సమర్పించిన ప్రాజెక్టు అనుమతి పొందిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పాజక్టుకు సంబంధించి రీసెర్చ్ అసోసియేట్స్‌గా పనిచేసేందుకు అభ్యర్థులు కావాలని, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 55 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ప్రాజెక్టు కాలం ఒక ఏడాది ఉంటుందని అభ్యర్థుల నైపుణ్యం బట్టి మరో ఏడాది పెంచేందుకు వీలుంటుందన్నారు. రూ. 25 వేలు గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ummareddy vsr@gmail.comకు తమ బయోడేటా పంపాలని కోరారు.

వాష్ రూమ్ ప్రారంభం

పాలకొల్లు టౌన్, జనవరి 9: పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం మంతెన నరసింహరాజు ప్రోత్సాహంతో తణుకు దేవి సీ ఫుడ్స్ విరాళం రూ.2లక్షలు, పాలకొల్లు సంధ్య మెరైన్స్ విరాళం రూ.2లక్షలు మొత్తం రూ.4లక్షల వ్యయంతో అడబాల రమణ పర్యవేక్షణలో నిర్మించిన వాష్ రూమ్‌ను ఆడిటర్ కలిదిండి రామరాజు ప్రారంభించారు.

యూత్ హాస్టల్స్ అధ్యక్షుడిగా నరసింహరాజు

భీమవరంటౌన్, జనవరి 9 : హౌసింగ్ బోర్డు కాలనీలో పద్మావతి వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో మంగళవారం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ భీమవరం శాఖ 23వ వార్షికోత్సవంలో అధ్యక్షునిగా మంతెన వెంకట నరసింహ సీతారామరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీవీజే సోమరాజు విచ్చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి, జనవరి 9: విద్యుత్ మరమ్మతులు కారణంగా మండల ంలో బుధవారం ఉదయం 8 గంటలు నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నామని ఈఈ బీ సురేష్ కుమార్ తెలిపారు.

లక్ష్యాలతో ఉన్నత శిఖరాలు



మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్త విష్ణుభట్ల

గణపవరం, జనవరి 9: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని ప్రవాసాంధ్రుడు, సీనియర్ శాస్త్రవేత్త విష్ణుభట్ల లక్ష్మన్న అన్నారు. చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం విద్యాసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని ప్రకటించారు. అధ్యాపకులు, పుర ప్రముఖులు ఆయనను సత్కరించారు. మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, నడిపల్లి శ్రీరామ్, చింతలపాటి సూర్యరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ

పెంటపాడు, జనవరి 9: మండలంలోని ముదునూరు, కే.పెంటపాడు గ్రామాల్లో మంగళవారం ఆయోధ్య రామమందిర అక్షింతలు ఊరేగింపుగా తీసుకువెళ్ళి ఇంటింటికి పంపిణీ చేసారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు దత్తు ప్రసాద్, పెంటమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్, జనసేన నాయకుడు నరాలశెట్టి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పాల దిగుబడి పెంపునకు చర్యలు



పడమరవిప్పర్రులో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పసల కనకసుందర్రావు

పెంటపాడు, జనవరి 9: పాల దిగుబడి పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనక సుందర్రావు అన్నారు. మంగళవారం పడమర విప్పర్రులో పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ పీ.మహేష్ , సర్పంచ్ తెంటు జయలక్ష్మి, మాజీ సర్పంచ్ పసల చంటి పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలసిన వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 9: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మంగళవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నియోజకవర్గ స్థితిని అచ్చెన్నాయుడుకు వివరించారు. ఆచంటలో జరిగిన ఆదినేత సదస్సుకు గూడెం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్ళడంపై బాబ్జిని అబినందించారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 9: ఎలక్ట్రికల్ వర్క్స్ రంగంలో పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం జరిగిన ప్రగతిశీల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన విద్యుత్ పనులు చేసే కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.